# క్లుప్తంగా

## యువజన విభాగం అధ్యక్షుడిగా జితేందర్‌రెడ్డి



సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా జితేందర్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి యువకులను పార్టీలో భాగస్వామ్యం చేస్తానన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



రాధమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: మండల పరిధిలోని గుంటిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ స్టోర్ డీలర్ ఓబుళరెడ్డి భార్య రాధమ్మ అనారోగ్యంతో అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు గుంటిపల్లి వెళ్లి రాధమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, మాజీ మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, వానవోలు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సపోట తోటకు నిప్పు



కాలిపోతున్న సపోట తోట

లేపాక్షి: మండలం కంచిసముద్రం పంచాయతీ జెడ్పీ పాఠశాల వెనుక భాగంలో శివమూర్తి, సిద్ధార్థలకు చెందిన సపోట తోట అగ్నికి ఆహుతైంది. మద్యం సేవించడానికి వెళ్లి బీడీ లేదా చుట్ట తాగి అక్కడ పడివేయడంతో తోటకు నిప్పు అంటుకొని ఉంటుందని స్థానికులు తెలిపారు. 10 ఎకరాల్లో తోట ఉండగా అందులో 6 ఎకరాల్లో కాలిపోవడంతో సుమారు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. చిలమత్తూరు, లేపాక్షి ఎస్‌ఐలు మునీర్‌అహమ్మద్, నరేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీఆర్‌ఓ గంగరత్నమ్మ నష్టం అంచనా వేసి తహసీల్దార్‌కు నివేదికను అందజేశారు.

## బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి




మాట్లాడుతున్న డీడీ పెంచలయ్య

పెనుకొండ: బర్డ్ ఫ్లూపై సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని వెటర్నరీశాఖ డీడీ పెంచలయ్య సిబ్బందితో పేర్కొన్నారు. పట్టణంలోని పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ పశు గణన సక్రమంగా చేపట్టాలన్నారు. ఏడీ శ్రీరాములు నాయక్, జేడీ శివశంకరనాయక్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నాగేంద్రప్ప ఉమ్మడి జిల్లా అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచారు. 55 ఏళ్లున్న వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయుడు నాగేంద్రప్ప పాల్గొని ప్రతిభ కనబరచారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు నాగేంద్రప్పను అభినందించారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు పంచాయతీలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం పై రైతులకు వెలుగు, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడి సాధించి తద్వార అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వానవోలు ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి నరసింహమూర్తి , వెలుగు సీసీ రవి, రైతులు పాల్గొన్నారు.

# ఆటకు చోటేదీ ?

విద్యార్థి దశ నుంచి క్రీడా నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడంలో కీలక పాత్ర పోషించేది ఆట స్థలాలే. అయితే ఆట స్థలాలను అభివృద్ధి చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వహిస్తుండటంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. కనీసం ఉన్నత పాఠశాలల స్థాయిలోనైనా క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసినట్లవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధికి నోచుకోని ఆట స్థలాలు
- మైదానాలు లేక క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- ఎగుడు దిగుడుగా ఉన్న ఆటస్థలాల్లోనే ప్రాక్టీస్



రొళ్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు చెరువులో ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల: మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు మండలాల్లో క్రీడా మైదానాలు, అవుట్ డోర్, ఇండోర్ స్టేడియంలు ఎక్కడా లేకపోవడంతో అన్ని వయసుల వారు నిత్యం ఆయా పాఠశాలల్లో ఉండే ఎగుడు దిగుడు ఆటస్థలాలనే ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. నియోజకవర్గంలోని 271 ప్రాథమిక, 21 ప్రాథమికోన్నత, 54 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటి పరిధిలోని దాదాపు 25,683 మంది విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు బడులకు వెళుతున్నారు. పలు ఉన్నత పాఠశాలల్లో ఖోఖో, కరాటే, కబడ్డీ, వాలీబాల్ తదితర ఆటలతో పాటు అథ్లెటిక్స్‌లో ప్రావీణ్యం పొంది జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులు కూడా ఉన్నారు. గతంలో ఆటల్లో రాణించి స్పోర్ట్స్ కోటలో ఉద్యోగావకాశాలు సాధించిన పూర్వ విద్యార్థులు కూడా ఉన్నారు. అయితే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల్లో విశాలమైన క్రీడా స్థలాలు ఉన్నా కూడా అవి ఏళ్ల తరబడి అభివృద్ధికి మాత్రం నోచుకోకపోవడం బాధాకరమని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రొళ్ల మండలం కాకిలో అభివృద్ధికి నోచుకోలేని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానం

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలల వివరాలు

| మండలం | ప్రాథమిక పాఠశాలలు | ప్రాథమికోన్నత పాఠశాలలు | ఉన్నత పాఠశాలలు | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|---|---|
| రొళ్ల | 53 | 02 | 08 | 3,722 |
| అగళి | 34 | 03 | 08 | 3,344 |
| గుడిబండ | 56 | 02 | 12 | 5,115 |
| అమరాపురం | 47 | 03 | 09 | 5,274 |
| మడకశిర | 81 | 11 | 17 | 8,228 |

- బీజీ హళ్లి ఉన్నత పాఠశాల వద్ద 3.5 ఎకరాల పైగా క్రీడా మైదానం ఉంది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి చేపట్టకపోవడంతో కబ్జాకు గురయ్యే అవకాశం ఉంది.
- కాకి, అలుపనపల్లి, రొళ్ల, రత్నగిరి, హొట్టేబెట్ట, హెచ్‌టీ హళ్లి, ఎం.రాయాపురం ఉన్నత పాఠశాలల ఆవరణంలో కూడా సరైన ఆట స్థలాలు లేక ఆటలు కుంటుపడుతున్నాయి.
- బీజీ హళ్లి, కాకి, హొట్టేబెట్ట, హెచ్‌టీ హళ్లి ఉన్నత పాఠశాలల్లో పీడీ, పీఈటీ ఉపాధ్యాయులే లేరు.
- మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కూడా దాదాపు ఇలాంటి ఇబ్బందులనే విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి అన్ని ఉన్నత పాఠశాలల్లోను క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### క్రీడలకు దూరమవుతున్నాం



కాకి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న క్రీడా మైదానాన్ని బాగు చేయాలి. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్న కల నెరవేరడం లేదు. అధికారులు ఉపన్యాసాల్లో చదువుతో పాటు క్రీడాల్లో కూడా విద్యార్థులు రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాని చెబుతున్నారు. అయితే పాఠశాల ఆవరణలో సక్రమంగా ఆటస్థలం లేకపోవడంతో క్రీడలకు దూరం అవుతున్నాము. అధికారులు స్పందించి క్రీడా మైదానాన్ని బాగు చేయాలి.

– కిరణ్, 6వ తరగతి, కాకి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల

### ఆటల్లో రాణించాలని ఉంది



చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్న ఆశ ఉంది. పాఠశాల ఆవరణలో సక్రమంగా క్రీడా మైదానం లేకపోవడంతో అది సాధ్యపడటం లేదు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి స్పోర్ట్స్ కోటలో ఉద్యోగం పొందాలని భావిస్తున్నాను. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకొని పాఠశాల ఆవరణలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసి ఆటలు ఆడడానికి అవకాశం కల్పించాలి.

– ప్రశాంత్, 6వ తరగతి, కాకి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల

### చర్యలు తీసుకుంటాం



మండలంలో ఉన్న కొన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలాలు సక్రమంగా లేని విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఇది వరకే ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. కనీసం ఉపాధి పథకం ద్వారానైనా క్రీడా మైదానాల మరమ్మతుకు కృషి చేస్తాం.

– శ్రీధర్, ఎంఈఓ, రొళ్ల మండలం

# పార్టీకి ద్రోహం చేసిన వారిని క్షమించం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మాట్లాడుతున్న ఈరలక్కప్ప

అగళి: పార్టీకి ద్రోహం చేసిన వారిని క్షమించే ప్రసక్తి లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. మంగళవారం మండలంలోని నరసబుందిలో జరిగిన కోల్హాపురి మహాలక్ష్మి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం నాయకుడు తిమ్మరాజు స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకరిద్దరు పార్టీ మారినా వైఎస్ జగన్‌తో పాటు వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం లేదన్నారు. వారు స్వలాభం కోసం వెళితే.. తాము పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. కుటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డు పెట్టుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధనరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మూర్తి, మడకశిర రూరల్ కన్వీనర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



విద్యార్థి శత్రు సింహను పరామర్శిస్తున్న నాయకులు

గుడిబండ: బీసీ హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న శత్రు సింహపై చేయి చేసుకోవడం దారుణమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పవిత్ర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మందలపల్లిలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర కలసి సందర్శించారు. విద్యార్థులు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థి శత్రు సింహ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు సక్రమంగా అన్నం పెట్టకుండా అడిగితే విద్యార్థుల చెంపలను వాయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలకు ఉచితంగా వస్తున్న సరుకులను సైతం అమ్ముకుంటున్న వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. లేకపోతే ఆందోళనకు శ్రీకారం చుడతామన్నారు.

## నాణ్యమైన భోజనం వడ్డించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సుబ్బరాయుడు

హిందూపురం టౌన్: బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న పిల్లలను సొంత పిల్లల్లా చూసుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో హాస్టల్ వార్డెన్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులతో స్నేహపూర్వక ధోరణితో మెలగాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని సూచించారు. హాస్టళ్లలో రుచిగా, శుచిగా భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలని ఆదేశించారు.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో మంగళవారం తాగునీటి ఎద్దడి నివారణపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు తదితర అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్యకు వచ్చిన నిధులను కేవలం తాగునీటి కోసమే ఖర్చు చేయాలన్నారు. ఐదు మండలాల్లో తాగునీటి సమస్య ఉందని ఎవరైనా రోడ్డెక్కితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఎక్కడా నీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాల్లోకెళితే... కొండంపల్లికి చెందిన భాగ్యలక్ష్మి (25) కుటుంబ కలహాలతో మంగళవారం ఇంట్లోనే నిద్రమాత్రలు మింగింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**చిన్నపరెడ్డిపల్లిలో...**

చిన్నపరెడ్డిపల్లి చెందిన వరలక్ష్మి (45) కుటుంబ కలహాలతో క్రిమి సంహారక మందు తాగింది. అపస్మారకస్థితిలో పడివున్న ఆమెను కుటుంబ సభ్యులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**రాంపురంలో మరొకరు..**

మంచి నీరు అనుకొని పొరబాటున పిడుదల కొట్టే మందును యువతి సేవించిన సంఘటన మండలంలోని రాంపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఐశ్వర్య (20) పశువుల పిడుదల కోసం కలిపి ఉంచిన క్రిమి సంహారక రసాయనాన్ని మంచి నీరు అనుకొని తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.



అమరాపురంలో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీలు

# అంగన్‌వాడీలకు శిక్షణ

సాక్షిబృందం: హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. కేంద్రానికి వచ్చే ప్రీ ప్రైమరీ పిల్లలకు ఏవిధంగా బోధన చేయాలి తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నారు. దీన్ని సద్వినియోగం చేసుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నేర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

# గందరగోళంగా మండల మీట్

- మైనర్ ఇరిగేషన్ డీఈ గైర్హాజరుపై సభ్యుల నిరసన



డీఈ లక్ష్మీనారాయణపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీడీఓ శ్రీధర్

పరిగి: మండల కేంద్రం పరిగిలో మంగళవారం ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం గందరగోళ పరిస్థితి నెలకొంది. మైనర్ ఇరిగేషన్ శాఖ నుంచి అధికారి హాజరు కాకపోవడంపై సభ్యులంతా నిరసన వ్యక్తం చేశారు. ప్రారంభానికి ముందే అధికారుల హాజరు పట్టికలో మైనర్ ఇరిగేషన్‌శాఖ డీఈ గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన మూడు సమావేశాలకు మైనర్ ఇరిగేషన్‌శాఖ డీఈ గైర్హాజరు కావడాన్ని నిరసనగా సభ్యులు వాకౌట్ చేశారు. ఆయన సమావేశానికి వస్తే తప్పా మేము హాజర కావమని తేల్చి చెప్పారు. ఈక్రమంలో సభకు హాజరైన సభ్యులు సంతకాలు చేయకపోవడంతో పాటు అప్పటి వరకూ కోరం సభ్యులు లేకపోవడంపై అధికారులు సైతం సభను నిర్వహించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ శ్రీధర్ కలగజేసుకుని మైనర్ ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణను ని ఫోన్‌లైన్‌లో సంప్రదించారు. మూడు సమావేశాలకు గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి చర్యలకు జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరిగేషన్ డీఈ గైర్హాజరుపై చర్యలకు ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదు చేసినట్లు తెలపడంతో సభ్యులు శాంతించారు. అప్పటికే బయటకు వెళ్లిపోయిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను బతిమలాడి పిలచడంతో సమావేశానికి తిరిగొచ్చారు. ఈక్రమంలో ఎంపీపీ సవిత కీలక పాత్ర పోషించి సభను సక్రమంగా నిర్వహించేలా చొరవ చూపారు.

**తాగునీటి సమస్యలకు ప్రాధాన్యం**

వేసవిలో నీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సవిత అధికారులకు సూచించారు. అనంతరం అధికారులు తమ శాఖా పరమైన నివేదికలను చదివి వినిపించారు. ప్రధాన సమస్యలను గాలికొదిలేసి కేవలం నివేదికలను చదివి వెళ్లిపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, కోఆప్షన్ మెంబర్ సలీం, తహసీల్దారు హసీనాసుల్తానా, వైస్ ఎంపీపీ శకుంతల, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, ఏఓ విజయభారతి, పీఆర్ ఏఈ నాగన్న, ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప, తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుపై విచారణ



అమరాపురంలో విచారణ చేస్తున్న డీఎస్పీ

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు సమీపంలో ఉన్న బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో అట్రాసిటీ కేసు నమోదు కావడంతో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సాక్ష్యులను విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం బాల్య వివాహాలు, సైబర్ నేరాలు తదితర వాటి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మడకశిర రూరల్ సీఐ. రాజకుమార్, ఎస్ఐ.ఇషాక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

**కేసుల పరిష్కారంపై దృష్టి సారించండి**

గుడిబండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాజకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సకాలంలో కేసులను పరిష్కరించడంతో పాటు అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజకుల్లాయప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం వివిధ కార్పొరేషన్ రుణాల మంజూరుకు నిర్వహించిన ఇంటర్వ్యూలు సజావుగా జరిగినట్లు ఎంపీడీఓ రామరావు తెలిపారు. హేమావతి ఏపీజీబీ పరిధిలో రుణాల కోసం 74 మంది నిరుద్యోగ దరఖాస్తు చేసుకోగా 44 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అమరాపురంలోని యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు పరిధిలో 104 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 70 మంది హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. వచ్చిన అభ్యర్థులకు ఏ ప్రాజెక్టుకు దరఖాస్తు చేశారు, రుణం ఇస్తే ఏమి చేస్తారు, ఎంత వరకు చదువుకున్నారు తదితర ప్రశ్నలను అధికారులు అడిగారు. కార్యక్రమంలో మేనేజర్లు రవీంద్రనాయక్, రాజేష్, ఎంపీడీఓ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**గడ్డివామి దగ్ధం**

పెనుకొండ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో రైతు సుబ్బిరెడ్డికి చెందిన గడ్డివాము విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. రూ.50 వేలు వరకూ నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి వెంకటేష్ తెలిపారు.

**కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య**

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రానికి చెందిన రామచంద్రప్ప (56) కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఐదారేళ్లుగా ఆయన కడుపు నొప్పితో బాధపడుతుండేవాడని, అయితే నొప్పి తీవ్రం కావడంతో సోమవారం రాత్రి ఇంటి పక్కనున్న పాఠశాల ఆవరణలో వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

**ఇంటర్వ్యూకు హాజరుకండి**

పెనుకొండ రూరల్: బీసీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 20న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీఓ నరేష్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్లతో పాటు రావాలని సూచించారు.

**20న బీడీ సంస్మరణ సభ**

పెనుకొండ: యంగ్ ఇండియా అధినేత నరేంద్రసింగ్ బేడీ సంస్మరణ సభ ఈ నెల 20న పట్టణంలోని ముస్లిం మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మాజీ ఉద్యోగులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

**నాగేనహళ్లిలో నీటి ఎద్దడి**



నీళ్ల కోసం ట్రాక్టర్‌లో డ్రమ్ములు బిందెలతో వెళ్తున్న ప్రజలు

పావగడ: తాలూకాలోని నాగేనహళ్లిలో నీటిఎద్దడి తీవ్రమైంది. 1200 జనాభా ఉన్న గ్రామంలో రెండు బోర్లు ఉండగా వాటిలో ఒకటి ఎండిపోయింది. మరోదానిలో అరకొరగా నీళ్లు వస్తున్నాయి. దీనికి తోడు మోటార్ చెడిపోవడంతో నీటి ఎద్దడి నెలకొంది. గ్రామ పంచాయతీ పీడీఓ సుదర్శన్‌కు విన్నవించుకున్నా స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**ఖైదీలకంటే హీనంగా చూస్తున్నారు**

రొద్దం: విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ వర్కర్లు పస్తులుండాల్సిన పరిస్థితి వస్తోందని సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు మూడు రోజుల పాటు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అయితే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాల్సివున్నా సక్రమంగా భోజనం పెట్టకుండా పస్తులు పెట్టారని విమర్శించారు.

**హామీలు నెరవేర్చండి**

పెనుకొండ: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 30 శాతం మధ్యంతర భృతి, 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలన్నారు. ధరలకు అనుగుణంగా డీఏలు చెల్లించాలన్నారు.

**నేడు చింత ఫల సాయం వేలం**

అమరాపురం: మండల పరిధిలోని వాహనాల పార్కింగ్, దుకాణాల రుసుముల వసూలు, వారపు సంతను, చింత ఫలసాయంకు బుధవారం సచివాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు.

## ఘనంగా జోత్యుల ఉత్సవం



అలంకరణలో మహాలక్ష్మి

అగళి: మండల పరిధిలోని నరసబుందిలో రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

## సమ్మె విరమించిన కార్మికులు

హిందూపురం టౌన్: నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కార్మికులకు చేపట్టిన సమ్మెను మంగళవారం విరమించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల పరిధిలోని కార్మికులకు దాదాపుగా 10 నెలల జీతాలు బకాయి ఉండడంతో కార్మికులకు 17వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. మంగళవారం గొల్లపల్లి వద్ద కార్మికులు సమ్మె చేపట్టారు. అయితే సీఐటీయూ రాష్ట్ర నాయకులు కార్మికులకు సమస్యలను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు, ఆర్‌డబ్ల్యూస్ అధికారులతో చర్చించగా మార్చిలో జీతాలు చెల్లించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు.